విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర-తణుకు: తడసిన, రంగు మారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్ చేశారు. తణుకు నియోజకవర్గం దువ్వ గ్రామంలో అకాల వర్షాలు వల్ల నష్టపోయిన వరి రైతాంగాన్ని గురువారం చంద్రబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కల్లాలలో ఉన్న ధాన్యం రాసులను పరిశీలించారు. ధాన్యం రాసులపై కప్పడానికి కూడా బరకాలు లేక పండించిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట తణుకు మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ,పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, నిడదవోలు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు బూరుగపల్లి శేషారావు, ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితు లలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని సంబంధిత అధికారులను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురు వారం గణపవరం మండలం మొయ్యేరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత మంది రైతులు వచ్చారు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లు, తేమ శాతం చూసే మిషన్, కాటా, స్టాక్ రూమ్ లను జిల్లా కలెక్టరు పరిశీలించి అధికారులకు ,సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టరు వెంట తహశీల్దారు పి. లక్ష్మి, ,యంపిడివో జి. జ్యోతిర్మయి, వ్యవసాయ శాఖ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ ,రైతులు, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య సహాయకుల నియామకం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో 537 రైతు భరోసా కేంద్రాల్లో 239 పశు వైద్య సహాయకులను శాశ్వత ప్రాతిపదికన నియమించినట్టు పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. నెహ్రూ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 537 రైతు భరోసా కేంద్రాల్లో 239 పశు వైద్య సహాయకులను శాశ్వత ప్రాతిపదికన నియమించినట్టు తెలిపారు. మిగిలిన 298 రైతు భరోసా కేంద్రాల్లో గోపాలమిత్రలు, పారా వెటర్నరియన్‌లను నియమించనున్నట్లు తెలిపారు. ఈ ఖాళీలను త్వరలో ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు . రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, హాజరును ప్రతి రోజు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఇప్పటివరకు 2612.6 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా , 165.1 మెట్రిక్ టన్నుల విత్తనం , 77 చాఫ్ కట్టర్లు, మినరల్ మిక్చర్స్, ఇతర సప్లిమెంట్స్ వంటి ఇతర ఇన్‌పుట్‌లు సరఫరా చేశామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు

విశాలాంధ్ర -కైకలూరు : మండలం లోని కొట్టాడ గ్రామ పంచాయతీలో తాగు నీరు అవసరాల నిమిత్తం 52.48 లక్షల రూపాయల నిధులతో పైప్ లైన్ వేసే పనులను ఎంపిపి అడవి కృష్ణ ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమెల్యే దూలం నాగేశ్వర రావు ఆదేశాల మేరకు మంచి నీటి అవసరాల కోసం పైపు లైను పనులు ప్రాంభించామని అన్నారు.ప్రభుత్వం గ్రామిణ ప్రాంతాలలో ప్రజలకు తాగునీటి అవసరాల కోసం మెరుగైన వసతులు కల్పిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ దండే పుష్పలత, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనలో జారి పడిన మాగంటి బాబు

ఎడమ కాలుకు గాయాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉంగుటూరు మండలం నాచుగుంటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించడానికి గురువారం వచ్చారు. ఈ పర్యటనలో ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) వెళ్ళగా అక్కడ జారి పడిపోయారు. ఎడమ కాలుకు గాయాలయ్యాయి. గాయ పడిన మాగంటి బాబును పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. గాయపడిన మాగంటి బాబును అక్కడి నుంచి కార్యకర్తలు తీసుకొచ్చి కారెక్కించారు.

తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు

విశాలాంధ్ర-మండవల్లి: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ పరిధిని విస్తృతం చేస్తున్నామని బ్యాంక్ మేనేజరు బి.దుర్గారావు తెలిపారు. గురువారం బ్యాంకులో నిర్వహించిన బంగారు ఆభరణాలపై వ్యవసాయ రుణాల పండుగ సందర్భంగా మేనేజర్ దుర్గారావు మాట్లాడుతూ జూన్ 30 వ తేదీ వరకు వ్యవసాయ రుణాల ఉత్సవంలో భాగంగా అత్యల్ప వడ్డి రేటు 71పైసలు మాత్రమేనని మూడు లక్షల వరకు ప్రోసెసింగు ఫీజు తీసుకోవటంలేదని నాలుగు లక్షల వరకు భూమి రికార్డులు అవసరం లేకుండానే త్వరితగతిన రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏబిఎం పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసరు రాజేష్, బంగారు మదింపు దారుడు అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వండి

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గంలో స్థానికులైన వారికి టీడీపీ టికెట్లు ఇవ్వాలని, జరగబోయే పొలిట్‌బ్యూరో సమావేశంలో దీనిపై ప్రతిపాదన తీసుకు రావాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు సీనియర్ టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యే గోరింట్ల బుచ్చయ్యచౌదరికి వినతిపత్రం అందించారు. ఐటీడీపీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడు బోడా అనీష్‌కుమార్, పార్టీ నాయకులు మారుమూడి థామస్, చింతలపూడి మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గడిదేసి ఏసు, దాసరి శ్రీనులు రాజమహేంద్రవరంలోని బుచ్చయ్యచౌదరి నివాసానికి వెళ్ళి స్థానికతపై వివరించారు. నియోజకవర్గంలో లేని వారికి టికెట్లు ఇవ్వటం వల్ల పార్టీ బలహీనపడుతుందని తెలిపారు. పదవుల కోసమే స్థానికేతరులు నియోజకవర్గానికి వస్తున్నారని, అటువంటి వారిని ప్రోత్సహించవద్దని కోరారు. ఈ సందర్భంగా వీరంతా బుచ్చయ్యచౌదరిని సన్మానించారు.

శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: బాల బాలికల్లో సృజనాత్మక శక్తులను పెంపొందించడానికి, వేసవి సెలవులను ఆనందంగా, ఆహ్లాదకరంగా వినియోగించుకోవడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో మే నెల 8వ తేదీ నుండి జూన్ 16 వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం శాఖా గ్రంథాలయంలో జరిగిన మీడియా సమావేశంలో శ్రీవిజ్ఞాన వేదిక, అరసవల్లి వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు,రిటైర్డ్ ఉద్యోగుల సహకారంతో నిర్వహించే వేసవి శిబిరంలో విద్యార్థులకు నీతి కథలు నేర్పించడం, గ్రంథాలయంలో గల పుస్తకములు చదివించడం, డ్రాయింగ్, డాన్స్, స్పోకెన్ ఇంగ్లీష్,యోగ, క్రాఫ్ట్, బ్యూటీ టిప్స్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన వివిధ అంశాలు నేర్పించడం వంటి సృజనాత్మక కార్యక్రమాలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగశాయి, కలిగొట్ల గోపాల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - చింతలపూడి : అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టని కారణంగా రైతులు అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, ప్రకృతి తప్పిదం అని ప్రభుత్వ యంత్రాంగం కల్లబొల్లి కబుర్లు చెబుతూ తన అసమర్ధతను కప్పిపుచ్చుకుంటుం దని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పంట చేతికొచ్చే సమయానికి రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించని కారణంగా ఒక్కసారిగా కురిసిన వర్షాలతో పంటలు పూర్తిగా నాశనం అయ్యాయన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి తక్షణం నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే అమ్మిన రైతులకు ఎకరానికి రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే పరదాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఏపి రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ కె.కాలేషా, దొంతా కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్ కే జానీ, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె. నివాస్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె. నివాస్ అన్నారు. గురువారం ఏలూరులోని శనివారపుపేటలో ఉన్న వై.ఎస్.ఆర్. విలేజ్ హెల్త్ క్లినిక్ ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌తో కలిసి రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె. నివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనరు క్లినిక్ కు వచ్చే రోగులకు ఇబ్బంది కరమైన పరిస్థితులు ఉంటే ఈ-టెలీ కన్సల్టేన్సీ ద్వారా స్పెషలిస్టు డాక్టర్లతో ఏలూరు లేదా విజయవాడ వారితో మాట్లాడే విధానాన్ని కమిషనరు పరిశీలించారు. .ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ డి. ఆశ, ఏలూరు మున్సిపల్ కమిషనరు ఎస్. వెంకటకృష్ణ, నోడల్ ఆఫీసరు ఎఫ్ పిసి డాక్టర్ జోషిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని పరామర్శించిన మంత్రి కారుమూరి

విశాలాంధ్ర-తణుకు: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తణుకు నియోజకవర్గంలో పంటనష్టపోయిన రైతులను గురువారం రాష్ట్ర పౌర సరఫరాల, విని యోగదారుల వ్యవహారాలు శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్వయంగా రైతుల వద్దకు వెళ్ళి వారితో మాట్లాడారు. రైతులెవరు అధైర్యపడవద్దని,పండించిన ప్రతి ధాన్యం గింజను కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్థూపాలను తొలగించడం దుర్మార్గం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయం ముందు మేడే కి ఏర్పాటు చేసిన మేడే స్థూపాలను ఎటువంటి సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని ఏఐటీయుసి జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి బాబు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. తక్షణం మేడే స్థూపాలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో మున్సిపల్ కార్మికుల ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపడతారని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపారు.

టెలి మానస్ 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

-ఆత్మహత్యలు నిరోధించడంలో మీడియా కీలక పాత్ర
- ఎన్ సి డి ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సిహెచ్. మానస

విశాలాంధ్ర-ఏలూరు: ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం ఉంటుందన్న విషయం గుర్తిస్తే బలవన్మరణాలను నిరోధించవచ్చని, మానసిక సమస్యలపై కౌన్సిలింగ్‌కి 14416 కాల్ చేస్తే మానసిక స్థైర్యం పొందవచ్చని ఎన్సీడీ ప్రాజెక్ట్ అధికారి ఆర్బీఎస్కె జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మానస చెప్పారు. ఆత్మహత్యలపై వార్తా కథనాలు- ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు,ఆత్మహత్యలు నిరోధించడంలో మీడియా పాత్ర అంశాలపై బెంగుళూరు 'నిమ్ హాన్స్' యూనివర్సిటీ కి చెందిన సైకాలజీ, సోషల్ వర్క్ విభాగం ప్రొఫెస్సొర్స్ అనీష్ చెరియన్, ఆర్య తిరుమేని తో కలిసి ప్రముఖ దినపత్రికలు, చానెల్స్ కు చెందిన ప్రతినిధులతో గురువారం బెంగుళూరు నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని, ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడే వారి సమస్యకు పరిష్కారాలున్నాయని , మరణమే శరణ్యం కాదని విశదీకరిస్తే బలవన్మరణాలను నిరోధించడానికి వీలవుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 14416 టోల్ ఫ్రీ నెంబర్ తో టెలి మానస్ ను ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైనా తీవ్రమైన మానసిక సమస్యలతో బాధపడేవారు 14416 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే మానసిక వైద్య నిపుణులు సదరు సమస్యకు సరైన పరిష్కార మార్గాన్ని సూచిస్తారన్నారు. బెంగుళూరు 'నిమ్ హాన్స్' యూనివర్సిటీ కి చెందిన సైకాలజీ, సోషల్ వర్క్ విభాగం ప్రొఫెస్సొర్స్ అనీష్ చెరియన్, ఆర్య తిరుమేనిలు తమ చర్చలలో మాట్లాడుతూ ఆత్మహత్యలకు సంబంధించి వార్తా కథనాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలకు లోబడి ప్రచురించేలా చూడాలన్నారు.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలు

- చేతికొచ్చిన పంట తడవటంతో రైతుల ఆందోళన

విశాలాంధ్ర - లింగపాలెం : అకాల వర్షాలతో మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో దాళ్వా వరి, కమర్షియల్ పంటలు పండించిన రైతులు అల్లాడుతున్నారు. ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్న పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు రావటంతో ఈ పంటలపై తీవ్ర ప్రభావం పడింది. కోసిన దాళ్వా ధాన్యం, మొక్కజొన్న తడిసింది. తడిసిన ధాన్యానికి మొక్క రావటంతో వరి పండించిన రైతులు దిగులు చెందుతున్నారు. విరిసి మొక్కజొన్న కండెలు తడిసాయి. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొనటంతో పంటలను ఆరబెట్టేందుకు అవకాశం లేకుండా ఉందని రైతులు ఆందోళనతో ఉన్నారు. మండలంలో దాళ్వా వరి పంట 1500 ఎకరాలలో వేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకి 25 క్వింటాళ్ళ దిగుబడులు వచ్చాయి. అనేక మంది రైతులు కోతలు కోశారు. కోసిన పనలు తడవటంతో ధాన్యానికి మొక్కరావటంతో రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలో తేమ శాతం సక్రమంగా ఉన్న కొంత ధాన్యాన్ని అధికారులు మిల్లర్లకు తరలిస్తున్నారు. మండలంలో దాదాపు 36 వేల క్వింటాళ్ళ ధాన్యం దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. ఇప్పటికి 500 ఎకరాలలో కోతలు కోశారు. మిగిలిన ఎకరాలు కోతకు సిద్ధంగా ఉన్నా వర్షాలు వల్ల నిలుపుదల చేశారు. నూర్పుళ్ళు చేసిన ధాన్యం తడవటంతో వీటిని ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో కమర్షియల్ మొక్కజొన్న 1300 ఎకరాల్లో పండించారు. ఎకరాకి దాదాపు 40 క్వింటాళ్ళ దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. దాదాపుగా 52 వేలు క్వింటాళ్ళు దిగుబడులు వస్తాయని అధికారులు తెలిపారు. మొక్కజొన్న పంటను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీరు తమకు అనుకూలంగా ధరను నిర్ణయిస్తున్నారు. ఇవి తడవటంతో ధర తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-కుక్కునూరు : గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య కుక్కునూరు మండల కమిటీ సమావేశం నెమలి పేట గ్రామంలో సోడె రత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దారయ్య మాట్లాడుతూ తరతరాలుగా పోడు వ్యవసాయం సాగు చేసుకొని జీవిస్తున్న గిరిజనులకు ఆ భూమిపై హక్కు పత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. పట్టాలిస్తామంటే గిరిజనులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయటమే తప్ప పట్టుమని పదిమందికి కూడా పట్టాలు ఇవ్వడం లేదని, వేలాది దరఖాస్తులు ఐటీడీఏ కార్యాలయంలో మగ్గుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే కొన్ని కులాలను ఎస్ టి జాబితాలో చేర్చడం వలన ఆదివాసి గిరిజనుల అభివృద్ధి నామ మాత్రంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య కుక్కునూరు మండల అధ్యక్షుడు సోడె నాగేష్, కార్యదర్శి వరసా పాపారావు, వరసా లక్ష్మీ, సోడే ఇరమయ్య, కణితి రాము వరసా నాగేశ్వరరావు,సిపీఐ నాయకులు మైసాక్షి వెంకటాచారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల ఆందోళన కార్యక్రమం మున్సిపల్ కార్యాల యం వద్ద రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. మేడే సందర్భంగా మున్సిపల్ కార్యాలయం బయటి ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ తమ రెండు యూనియన్‌ల తరపున రెండు కర్రలు పాతి జెండాలు ఎగుర వేశారు. మున్సిపల్ కమిషనర్ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన సిబ్బందితో జెండా కర్రలు తొలగించడంతో మున్సిపల్ కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. గురువారం ఉదయం కార్మికులకు తమ జెండా కర్రలు పెట్టుకోడానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇస్తే విధులకు హజరవుదామని వచ్చిన కార్మికులకు మున్సిపల్ కమిషనర్ ఎటువంటి హామీ ఇవ్వక పోవడంతో రెండవ రోజుకూడా పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కాలేదు. ప్రయివేట్ పారిశుధ్య కార్మికులతో పట్టణంలో తాత్కాలికంగా పారిశుధ్య పనులు చేయించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ కార్మికులతో చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడతారని చెప్పారని సాయంత్రం వరకూ ఎదురు చూసినా చైర్ పర్సన్,కమీషనర్ తమతో మాట్లాడలేదని కార్మికులు తెలిపారు.కార్మికులకు ఎంతో ముఖ్యమైన యూనియన్ జెండాలు మళ్లీ పెట్టే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) గౌరవాధ్యక్షులు జే. వి.రమణ రాజు,సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎస్.కే.సుభా షిణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పసల సూర్యారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్తూరి నాగేశ్వరరావు, కే.విఘ్నేష్, నాగరాజు, బాలరాజు, వేల్పుల రాజు,వెంకటేష్, లక్ష్మణ్, తులసి, మంగ, సత్యవతి ,గౌయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మహిళా రైతుకు చంద్రబాబు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-ఉంగుటూరు: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వచ్చిన టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట వచ్చారు. ఉంగుటూరు గ్రామ వైసీపీకి చెందిన చిరంజీవి, ప్రభావతి దంపతులు అకాల వర్షాల వలన పంట నష్టపోయారని చంద్రబాబుకు వివరించారు. చంద్రబాబు స్పందించి వాళ్ల పిల్లల ఫీజు కట్టుకోవడం కోసం... 2,30,000 సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా నాయకులు గన్ని వీరాంజనేయులు, మాగంటి బాబు, చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి ,గంటా మురళి, బలగం శ్రీను, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి చందు, మండల టిడిపి అధ్యక్షులు పాతూరి విజయ కుమార్, రవి శంకర్, జిల్లా ప్రముఖ నాయకులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PENMETSA LAKSHMI (New Name), W/o PENMETSA SATYANARAYANA RAJU,** Previously Called **PENMATCHA LAKSHMI (Old Name),** Resident of D.No. 16-31, Rajula peta, Near Govt. Hospital, Undi Village, West Godavari District-534199, Andhra Pradesh, Now Changed my Name from **PENMATCHA LAKSHMI (Old Name) to PENMETSA LAKSHMI (New Name).** Today onwards Use my New Name for all further Transactions.

రైతుల నుండి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

విశాలాంధ్ర-ఉండి : రైతుల నుండి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు మిల్లర్ల వద్దకు వెళ్ళవల్సిన అవసరం లేదని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి అన్నారు. ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , చెరుకువాడ రామాంజనేయ మోడరన్ రైస్ మిల్లు ను జిల్లా జాయింటు కలెక్టరు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రిజిష్టర్లు ,తేమ శాతం చూసే మిషన్, కాటా, స్టాక్ ను అయన పరిశీలించారు.రైసు మిల్లు రిజిస్టర్లు ,స్టాక్ ను, ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైస్ మిల్లుల నుండి ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ధాన్యం కొనుగోలుకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట డిప్యూటీ తహశీల్దారు స్వామి నాయుడు, వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య, రైతులు, ఆర్ బి కె సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్ను కలిసిన కౌన్సిలర్లు

విశాలాంధ్ర-ఆకివీడు: నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు వహించిన కృష్ణ మోహన్‌ను గురువారం తెలుగు దేశం, జనసేన పార్టీ కౌన్సిలర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, మాజీ సర్పంచ్, ఆకివీడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గొంట్ల గణపతి కృష్ణమోహన్ తో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నగర పంచాయతీకి తమ సేవలు అందించి నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వీరితోపాటు కౌన్సిలర్లు బొల్లా వీర శ్వేత, కిమిడి అరుణకుమారి, మోపిదేవి సత్యవతి, బత్తుల శ్యామల, నేరెళ్ల ప్రసన్న, గోపిశెట్టి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రామిశెట్టి

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఎంపీపీల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రామిశెట్టి సత్యనారాయణ నియమితులయ్యారు. ముదినేపల్లి మండల పరిషత్ అధ్యక్షులైన రామిశెట్టి సత్యనారాయణను ఏలూరులో జరిగిన ఎంపీపీల రాష్ట్ర కార్యవర్గ నియమాక ప్రక్రియలో ఈ పదవి సత్యనారాయణను వరించింది. ఎన్నికైన ఎంపీపీ సత్యనారాయణను ముదినేపల్లి ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, నాయకులు బొర్రా శేషు, సాక్షి సాయి, కరేటి గోవిందరాజులు, గూడపాటి వరప్రసాద్, షేక్ అల్లాబక్షు, కొమటి విష్ణువర్ధన్, బేతు రాజా, గంటా కోటేశ్వరరావు, కార్యకర్తలు అభినందించారు.

నామాల వాడికే పంగనామాలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో కొంతమంది అవినీతి అధికారులకు ఇక హడలే. దేవస్థానంలో దశాబ్దాలుగా పనిచేస్తూ మధ్యవర్తుల ద్వారానో ఇతర మార్గాల్లోనో లంచాలు తీసుకుంటూ నామాలవాడికే పంగనామాలు పెడుతూ ఏసీబీకి దొరక్కుండా అవినీతికి పాల్పడుతున్నారు. వీరిలో ఒకరైన వాసా నగేష్ అక్రమంగా సంపాదించిన ఆస్తులపై ఏసీబీ అధికారులు బుదవారం ఏకకాలంలో దాడులు చేశారు. ఇప్పటికే 18లక్షల నగదు, 210గ్రాముల బంగారం, ద్వారకాతిరుమలలో నాలుగు అంతస్థుల అపార్ట్‌మెంట్, తాడేపల్లిగూడెంలో ఇల్లు, జంగారెడ్డిగూడెంలో ఇల్లు, నిడదవోలులో ఇల్లు, ఇంటిప్లాటు, ఒక కారు, రెండు మోటార్‌సైకిళ్ళు, గుర్తించారు. వీటితోపాటు బినామీపేర్లతో కొనుగోలు చేసిన ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లాకర్లపై సోదాలు కొనసాగుతున్నాయి.

హడలెత్తిపోతున్న అధికారులు :ద్వారకాతిరుమలలో పనిచేసే కొంతమంది అధికారులు భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కీలక శాఖల్లో పనిచేసే నలుగురు వ్యక్తులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారు. నగేష్ ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడంతో ఉలిక్కిపడిన వీరంతా అక్రమంగా సంపాదించిన సొమ్మును భద్రపరచేందుకు హడావిడి పడినట్లు తెలుస్తోంది. ఏసీబీ అదికారులు వీరందరిని వలపన్ని పట్టుకునేదెప్పుడో అని గ్రామప్రజలు ఎదురుచూస్తున్నారు.

దర్శకరత్న దాసరికి నివాళులర్పించిన జెడ్పీ చైర్మన్

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రి, దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. దర్శకరత్న దాసరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు వైసిపి నాయకులు దాసరి అభిమానులు పాల్గొన్నారు.

ఇది ప్రకృతి తప్పిదం కాదు... ప్రభుత్వ తప్పిదం

విశాలాంధ్ర - పాలకొల్లు: ఇది ప్రకృతి తప్పిదం కాదు ముమ్మాటికి ప్రభుత్వ తప్పిదమే అని పాలకొల్లు శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి చేలు, కల్లాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వరి ధాన్యం అమ్ముకోవడానికి పడే కష్టాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ ఏ కల్లాల్లోకి వెళ్ళినా, ఏ చేలోకి వెళ్ళినా, ఏ పుంతలలోకి వెళ్ళినా ధాన్యం తడిసిపోయి, రంగు మారి, రైతులు దీనావస్థలో ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇది ప్రకృతి తప్పిదం కాదని ఎందుకంటే ఏప్రిల్ మొదటి వారంలోనే కోతలు కోసి పంట చేతికొచ్చినా ఏప్రిల్ 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనేవాళ్ళు లేకపోవడంతో, మొదటి వారంలో కోయవలసిన కోతలు కూడా, మూడవ వారంలో కోసే పరిస్థితికి తీసుకురావడంతో రైతులు నష్టపోయిన పరిస్థితి ఉత్పన్నం అయ్యిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే మేల్కొని రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం, చేలలో, కల్లాల్లో నాని పోతున్న ధాన్యానికి కూడా సంచులు ఇచ్చి, ఆ ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంధన పొదుపును బాధ్యతగా తీసుకోవాలి : ఎస్సై

విశాలాంధ్ర-మండవల్లి: పరిమితంగా లభ్యమయ్యే ఇంధనాన్ని పొదుపుచేయటం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు.ఇంధన సంరక్షణ క్షమత పక్షోత్సవం-2023లో భాగంగా గెయిల్ఇండియా గుడివాడ వారిచే మండవల్లి గ్రామంలో గురువారం అవగాహనా ర్యాలీ జరిగింది. ర్యాలీ తదుపరి ఉచితంగా వాహనకాలుష్య తనిఖీ నిర్వహించగా ఎస్సై ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంధన పొదుపు ప్రాముఖ్యతను వివరించి వాహనదారులకు రహదారి భద్రతా నియమాలుపై విశదీకరించారు.ఇంధన పొదుపుతో భావితరాలకు ఇబ్బందులుండవని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో గెయిల్ అధికారులు బాలకృష్ణయ్య, కృష్ణమాచార్యులు, శివప్రసాద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల్లో రైతాంగం

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని పోలవరం మాజీ శాసనసభ్యులు మొడి యం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నియోజకవర్గంలో ధాన్యం, మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలు పూర్తిగా పాడైపోయాయని రైతాంగం తీవ్రంగా నష్టపోయి పీకల్లోతుల్లో అప్పుల్లో మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రకృతి తప్పిదమని ప్రభుత్వం చెబుతుందని వాస్తవంగా రైతు భరోసా కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు నష్టపోయేవారు కాదని తెలిపారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే రైతులు నష్టపోయేవారు కాదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామస్థాయిలో వర్ష ప్రభావంతో నష్టపోయిన పంటలను గుర్తించి అంచనా వేసి నివేదికను సమర్పించి తక్షణం సాయం అందించే దిశగా కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులు తరపున న్యాయం జరిగే వరకూ టిడిపి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మనకోసం మనం ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర - పోడూరు : మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ 5వ వార్షికోత్సవం, గురువారం పోడూరు మండలం జిన్నూరు సుబ్బారాయుడు కాలనీలో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల పెద్దిరాజు, కృష్ణవేణి ఆధ్వర్యంలో పలువురు ప్లాట్ రిక్షా కార్మికులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలను అందించారు. పెద్దిరాజు మాట్లాడుతూ సేవ చేయడంలో ఉండే తృప్తి వెలకట్టలేనిదన్నారు. అందరి సహకారంతో విజయవంతంగా ఐదో వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ జమ్ము బేబీ మహా లక్ష్మి, జిన్నూరు సొసైటీ అధ్యక్షుడు డీటీడీసీ బాబు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు. సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, భూపతి రాజు చిన్నసూరి, గండేటి శేఖర్, రవి, గ్రామ పెద్దలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాసుని కళ్యాణం

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, వైశాఖమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని కళ్యాణం గోవిందనామస్మరణలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య కదురమణీయంగా సాగింది. శ్రీవారి తూర్పుగాలిగోపురం ఎదురుగా భారీకళ్యాణవేదికను ఏర్పాటుచేసి కళ్యాణ పరిసరాలతోపాటు ఆలయ పరిసరాలన్నీ విద్యుద్దీప అలంకరణలు చేశారు. ముందుగా రకరకాల పుష్పమాలికలతో, పచ్చిపూలతో, బెంగుళూరు పుష్పాలతో, అరటిబోదెలతో, మామిడితోరణాలతో, విద్యుద్దీప అలంకరణలతో, కళ్యాణవేదికను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో తొళక్కం వాహనంపై శ్రీవారి, అమ్మవార్ల కళ్యాణమూర్తులను వేంచేపుచేసి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు వేదపండితులు, ఆగమపాఠశాల విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణలు గజ, అశ్వసేవల నడుమ వాహనాన్ని కళ్యాణవేదికవద్దకు తెచ్చారు. అప్పటికే వేదికపై ప్రత్యేకంగా అలంకరించిన రజిత సింహాసనంపై కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు కళ్యాణతంతు ప్రారంభించారు. కళ్యాణమహూత్సవానికి దేవాదాయశాఖ మంత్రి కొట్టుసత్యన్నారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

విశ్వేశ్వరస్వామి సేవలో ఎంఎల్‌సి జయమంగళ

విశాలాంధ్ర-మండవల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింగాల గ్రామంలోని గంగా విశాలాక్షిసమేత శ్రీవిశ్వేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ పాల్గొని గురువారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను తిలకించారు. పురోహితలు ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ రాజులపాటి యశోధనరావు ,ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు,ఎంపిటిసి కమదన శేషతల్పారావు, ఖాదర్‌బాషా, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గ్రంధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిధున్ రెడ్డి ఉండి నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు గురువారం భీమవరం రాగా, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ యూత్ క్లబ్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమవరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు కై వినతి పత్రం అందించారు. అనంతరం ఉండి సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించిన టీడీపీ బృందం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండలంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటను టిడిపి మండల కొయ్యలగూడెం అధ్యక్షులు పారేపల్లి నరేష్, ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో పరిశీలించింది. ఈ సందర్భంగా పారేపల్లి నరేష్ మాట్లాడుతూ అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దెబ్బతిన్న పంటను కూడా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు చేయని పక్షంలో టిడిపి తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణ, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు చింతల వెంకటరమణ,బూత్ కన్వీనర్ మత్తపటి నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎంపీపీ అధ్యక్షునిగా పేరిచర్ల

భీమవరం -భీమవరం టౌన్ : పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీ అధ్యక్షునిగా భీమవరం మండల ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో గురువారం జరిగిన పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీల సమావేశంలో ఎంపీపీలందరూ కలిసి నరసింహా రాజు ను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం నూతన పాలకవర్గం స్థానిక ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ ను స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల అభివృద్ధికి ఎంపీపీలు కృషి చేయాలని కోరారు. ముందుగా నరసింహారాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రుద్ర ధనరాజు, ఉపాధ్యక్షులు సబ్బితి సుమంగళి సాగర్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, అధికార ప్రతినిధి కర్రి వెంకట నారాయణ రెడ్డి, కార్యదర్శులు దాసరి హైమావతి, నల్లి జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజులు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - అనపర్తి : ఏప్రియల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టినట్లయితే రైతులు నేడు ఈ దుర్భర పరిస్థితి ఎదుర్కొనే వారు కాదని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కొప్పవరంలో వర్షానికి తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం రాశులు, కల్లాలు, పొలాలను రామకృష్ణారెడ్డి, టిడిపి శ్రేణులు పరిశీలించి రైతుల గోడు తెలుసుకున్నారు.

అనంతరం నల్లమిల్లి మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని, క్షేత్రస్థాయిలో రైస్ మిల్లర్స్, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది ఎంపిక

విశాలాంధ్ర -ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , హెచ్ సి ఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సర్ సి.ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, వట్లూరులో ఏర్పాటు చేసిన హెచ్ సి ఎల్ టెక్ బీ "క్యాంపస్ డ్రైవ్" కెరీర్ ప్రోగ్రాంకు 105 మంది అభ్యర్థులు హాజరై 26 మంది మొదటి దశలోలో అర్హత పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ తమ్మాజీ రావు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మాజీరావు మాట్లాడుతూ గత సంవత్సరం లో కూడా హెచ్ సి ఎల్ నుంచి ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకొని ఉద్యోగాలలో చేరారని ఐటి రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఐటి కెరియర్ మొదలుపెట్టాలనుకునే వారికి ఇది సువర్ణ అవకాశం అన్నారు.ఈ కార్యక్రమం లో హెచ్ సి ఎల్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ హెచ్ సి ఎల్ వంటి పెద్ద సంస్థ లలో చేరటానికి ఇది పెద్ద అవకాశం అని భారతదేశంలో 8 బ్రాంచ్ లు ఉన్నాయన్నారు. ఐటి కు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని యువత అంది పుచ్చుకోవాలని తెలిపారు. సీడాప్ జే.డి.ఎం పార్థసారథి మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశం అని మొదటి రౌండ్ పూర్తి చేసిన అభ్యర్థులకు శు భాకాంక్షలు తెలియ జేసారు. ఈ కార్యక్రమం లో ఎపి ఎస్ ఎస్ డి సి సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

27న న్యూ జెర్సీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర -భీమవరం: అమెరికాలో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ నెల 27వ తేదీన అమెరికాలోని న్యూ జెర్సీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాల ప్రిన్సిపాల్, సెక్రటరీ అండ్ కస్పాండెంట్ ఎస్.ఆర్.కె నిశాంత్ వర్మలు మీడియాకు వివరాలందిస్తూ సుమారు 43 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన తమ కళాశాల పూర్వ విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. సుమారు 600 మంది పూర్వ విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి ఎస్.ఆర్.కె.ఆర్ అల్యూమిని అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (సానా) గా ఏర్పడ్డారు. విద్యార్థులు ఇప్పటికే అసోసియేషన్ లో చేరి ప్రప్రదముగా అమెరికాలోని న్యూ జెర్సీలో ఉన్న నార్త్ అమెరికా తెలుగు సొసైటీ కన్వెన్షన్ సెంటర్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలుగా ఏర్పడి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనేందుకు కళాశాల ప్రిన్సిపాల్, మేనేజ్మెంట్, పలువురు ప్రొఫెసర్ కూడా పాల్గొనేందుకు న్యూ జెర్సీ వెళ్తున్నట్లు వారు వెల్లడించారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తడిసిన మొక్కజొన్న పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం సాయంత్రం మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు.వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గురునాధరావు మాట్లాడుతూ పంగిడిగూడెం గ్రామంలో సుమారు 150 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట కల్లాలపై ఉండగా వచ్చిన అకాల వర్షం కారణంగా పంట మొత్తం తడిసి మొలకలు వచ్చాయని ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగ చేసిందని వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి పంటను ప్రభుత్వం వెంటనే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు,పంగిడిగూడెం రైతులు, నాయకులు వనచర్ల లింగస్వామి, అడవికొట్టు రవి, బిరుదు గడ్డ రాజు, బాలు,జీడిగంటి రామారావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వేలేరుపాడు మండలం భూదేవి పేట గ్రామానికి చెందిన పి.కమలాకర్ కు ప్రమాదంలో పొట్ట భాగం నుండి కాళ్ళ వరకూ సచ్చు బడి పోవడంతో తన జీవనాన్ని చాలా ఇబ్బందిగా సాగిస్తున్నాడు. ప్రతీ నెలా మందులు తీసుకోవడానికి అతను పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు నెలకు రూ.2 వేల చొప్పున బాధితుడు కమలాకర్ జీవితాంతం ప్రతీ నెల పించన్ ఇవ్వడానికి ముందుకు వచ్చింది.జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వసుధ ఫౌండేషన్ సభ్యులు కొండపల్లి పండు,సి.హెచ్.చంద్ర శేఖర్, కే.రామకృష్ణ బాధితుని గ్రామం వెళ్లి ఆ నగదు అందచేశారు.

ద్విచక్ర వాహనాలు వేలం

విశాలాంధ్ర-టి.నరసాపురం : ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించినట్లు ఎస్సై కె. సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఎక్సైజ్ శాఖ,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన 18 వాహనాలకు వేలంపాట నిర్వహించగా 15 ద్విచక్ర వాహనాలు రూ. 2లక్షల 78వేలకు వేలం జరిగిందని 3వాహనాలకు వేలంపాట కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. మిగిలిన వాహనాలకు మళ్లీ వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వై. దుర్గారావు, ఎస్సై, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - పి గన్నవరం : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి పంటలు, ధాన్యం రాశులు తడిసిపోవడం వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పి గన్నవరం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గంటి హరీష్ మాధుర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పి గన్నవరం మండలంలోని పి గన్నవరం, పోతవరం గ్రామాలలోని పలు ప్రాంతాలలో పర్యటించి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన వరి పంటలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులను వారికి కలిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, ఎంపీపీ అంబటి భూలక్ష్మి కోటేశ్వరరావు, పి. గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు మట్ట ప్రభాకర్‌రావు, తెలుగు రైతు నాయకులు సంసాని పెద్దిరాజు, ఆరుమిల్లి లాల్ బాబు, టిడిపి నాయకులు నక్క వీర వెంకట సత్యనారాయణ, నేలపూడి దామోదర్, శేరు శ్రీనుబాబు, చొల్లంగి సత్తిబాబు, కొల్నాడ సత్యనారాయణ రాజు, సాధనాల ఎస్వీ, పైడి బుజ్జి, నక్క సునీల్ రాజు, సిఖిలే దేవిడ్ రాజు, కొపనాతి సీతారామస్వామి, చీకట్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను వెంటాడుతున్న వర్షాలు

విశాలాంధ్ర-భీమవరంటౌన్ : అకాల వర్షాల వల్ల అన్నదాతలను అనేక కష్టాలు వెంటాడు తున్నాయి. ఆరుగాలాల పాటు శ్రమించి పండిం చిన

ధాన్యాన్ని చివరకు చేతికందే పరిస్థితి లేక అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ప్రభావం వల్ల వరిచేలు నేలకొరిగాయి. అవి కొయించడానికి పని వారి దొరక్క యంత్రాలతో మాసూళ్ళ చేపట్టారు. అవి కాస్త వర్షాల ప్రభావం వల్ల చేలలో నీరు నిలిచిపోవడంతో వాత యంత్రాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. దీంతో రైతులు చేసేదేమీ లేకఆందోళన చెందుతున్నారు.

రక్త హీనత రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: రక్త హీనత రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సచివాలయ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ టి ఎన్ స్నేహన్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం మండల వైద్యాధికారి డాక్టర్ ఎమ్ శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్నేహన్ మాట్లాడుతూ కౌమార దశలో వున్న బాలికలకు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ పి ప్రసాదరావు, హెచ్ ఎస్ రవి, పిహెచ్ ఎన్ లలిత కుమారి ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : అకాల వర్షాలు, ఈదురు గాలులకు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ

గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు డిమాండ్ చేశారు.జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గురువారం గోపాలపురం మండలం ,కొవ్వూరుపాడు గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆ గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు ప్రగడ రాంబాబు ఆధ్వర్యంలో, గోపాలపురం నియోజకవర్గం నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, పంట నష్టం జరిగిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మానవతా దృక్పథంతో సరైన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ గౌస్,సత్యనారాయణ,పోలుమాటి నాని, మరియు గ్రామ నాయకులు చిలక వెంకన్న , వేగివాడ నాగేశ్వరరావు, శ్రీను, బాబు, తాతారావు,రవి కిరణ్,మంగరాజు , మోహన్ ,వీర మహిళ శాంతి జనసేనకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర - కామవరపుకోట : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులందరూ పెన్షన్ పొందుతున్న ఉద్యోగులందరూ విధిగా సి ఎఫ్ ఎంసి చేసుకోవాలని చింతలపూడి సబ్ రిజిస్టర్ ఉద్యో గీ వీర్రాజు తెలిపారు. సి ఎఫ్ ఎంసి ఐడి పొందాలనుకునేవారు ఈ అనుసంధానం ఎంతో అవసరం అన్నారు. గురువారం కామవరపుకోట ఎంపీడీవో కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు కేవైసీ చేయించుకున్నారని తెలిపారు.

టీ కేఎం ఇన్నోవా క్రిస్టా టాప్ గ్రేడ్స్ ధరల ప్రకటన

విశాలాంధ్ర-కాకినాడ: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) నేడు తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్ మరియు వీఎక్స్) ధరలను వెల్లడించింది. టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ ఈ వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసిమా కలిగి ఉంటుందనీ, దీనిని కఠినమైన ధృడమైన ప్రదర్శన కోసం నిర్దిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్ అవసరాలు తీరుస్తుందని, ఎక్స్ షోరూమ్ ధరలు దేశవ్యాప్తంగా అన్ని గ్రేడ్‌లకూ వర్తిస్తాయన్నారు. ప్రీమియం కలర్స్‌కు అదనపు ధరలు వర్తిస్తాయని,తమ విభాగంలో ఈ ప్రతిష్టాత్మక ఎంపీవీ అగ్రగామిగా 2005లో మార్కెట్‌లో విడుదలైన నాటి నుంచి నిలువడంతో పాటుగా ఇప్పటి వరకూ ఒక మిలియన్‌కు పైగా యూనిట్లు విక్రయించబడ్డాయని చెప్పారు.

మహానాడు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు వస్తున్న సందర్భంగా తెలుగుదేశం మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పిలుపునిచ్చారు.మండలం లోని పరిజెల్లిపేట గ్రామంలో టీడీపీ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27,28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో మహానాడు కార్యక్రమాలు ఘనంగా జరిగేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.మండలంలో అన్ని గ్రామాల్లోనూ పార్టీ ప్రతిష్టం చేయడానికి నాయకులందరినీ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంటు ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,మాజీ జడ్పీటీసీలు బత్తుల త్రిమూర్తులు,కొల్లంరత్నం, నాయకులు తోటకూర నాగేశ్వరరావు, మద్దిరెడ్డి చిన్న వేంకటేశ్వరరావు, చిట్టిప్రోళ్ల పద్దరాజు,ముక్కినాడ రంగరాజు,నూనె వెంకన్న,దొండపాటి లాజర్,ఖండవల్లి లక్ష్మీ,దాసరి శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : తాణేలంక గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి వార్షిక జాతర మరియు తీర్థ మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చన, విగ్రహం వద్ద పులిహోర కుంభంగా పోసి దానిపై రవ్వ లడ్డులు అలంకరించి అమ్మవారికి నివేదించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రేపు తీర్థ మహోత్సవం, భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు. సాయంత్రం జరిగే జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు వెంకటేశ్వరా కాలేజీలో టీజర్ విడుదల

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మూవీ ట్రిజర్ విడుదల కానున్నది. స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటీఫుల్ గర్ల్ చిత్రం శ్రీ వెంకటేశ్వరా సెమినార్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు టీజర్ విడుదల చేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె మనోహర్, వైస్ ఛైర్మన్ కరాటం ప్రవీణ్, కె శ్రావణ్ దిలీప్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హీరోలు, హీరోయిన్‌లు చిత్ర బృందం పాల్గొంటారు.

వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించిన మండల అధికారులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండల వ్యవసాయ అధికారి, జగ్గంపేట ఇన్చార్జి ఎడి ఇంటి వీర గంగాధర్, ప్రత్తిపాడు తాసిల్దార్ పివివి గోపాలకృష్ణ సంయుక్తంగా వర్షానికి తడిచి ఉన్న వరి పొలాలను కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి పరిశీలించారు. కోసి పనల మీద వరి పొలాల్లో నీరు లేనట్లయితే పొలాల్లో ఉండగానే లీటర్‌కి 50 గ్రాములు ఉప్పు ద్రావణం పిచ్చికారి చేయాలని ఏవో గంగాధర్ తెలియజేశారు. పొలాల్లో నీరు ఉన్నట్లయితే ఎత్తైన ప్రదేశానికి పనలు తరలించి ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. తడిచి పనుల మీద ఉన్న వరిని కుప్పగా వేయడానికి ఎకరానికి 25 కేజీల ఉప్పును పనల మీద జల్లుతూ కుప్ప వేయాలి. ఈ విధంగా చేయడం వల్ల మొలక మరియు ధాన్యం రంగు మారడాన్ని నివారించవచ్చని తెలియజేశారు. తడిసిన ధాన్యం కొనుగోలు కోసం రైతు భరోసా కేంద్రాల్లో సహాయకులను సంప్రదించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ,గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ జయంతి

విశాలాంధ్ర - అమలాపురం : నరసింహ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం ఐదు గంటలకు రామానుజ దాసుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ నందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. అనంతరం పరదా సూరిబాబు మాట్లాడుతూ హిరణ్యకశిపుని సంహరించడానికి శ్రీహరి నరసింహ అవతారంలో అవతరించి హిరణ్యకశిపుని సంహరించారని, తన భక్తుడైన ప్రహ్లాదుని ఎన్నిహింసలకు గురిచేసినా స్వామి కాచి కాపాడారని, హిరణ్యకశిపుని సంహరించి ఉగ్రుడై ఉన్న నరసింహుని శాంతింప చేయడం ఎవరి వలనా కాదని దేవతలు గ్రహించి భక్తుడైన ప్రహ్లాదుని వళ్ళనే సాధ్యమని తెలుపుగా ప్రహ్లాదుడు నరసింహుని శాంతింపమని వేడుకొనగా స్వామి శాంతి రూపం ధరించినారని మనం పురాణ ఇతిహాసాలు, చలనచిత్రాల ద్వారా తెలుసుకొగలిగామని తెలిపిన ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ముఖ్య సలహాదారు వంకాయల కాశీ, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, సంఘ కార్యవర్గ సభ్యులు మండవల్లి నాగేశ్వరరావు, నూలు కృష్ణ, అప్పన వీరన్న, పచ్చిగోళ్ళ రాజా, కంచర్ల అయ్యప్ప, గొల్లపూడి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి నివేదించిన పానకాన్ని ప్రసాదంగా స్వీకరించారు.